సాక్షి
నారాయణపేట
శనివారం । 29 । ఏప్రిల్ । 2023



తరలుతున్న ధాన్యం
కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు వరిధాన్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నారు.
వివరాలు IIలో ▸



డబ్బులు రెట్టింపు చేస్తామని..
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయి.
వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /23.0
వాతావరణం
గాలిలో తేమశాతం అధికంగా ఉండడంతో చల్లగా ఉంటుంది. రోజంతా ఆకాశం మేఘావృతమై మోస్తారు వర్షం కురవచ్చు.

న్యూస్‌రీల్

కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు ఏర్పాట్లు

మహబూబ్‌నగర్ క్రైం: ఈ నెల 30న జిల్లాలో నిర్వహించే కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల దగ్గర ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఉండటానికి 254 మంది పోలీస్ సిబ్బందితో మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంతోపాటు భూత్పూర్‌లో కలిపి 31 పరీక్ష కేంద్రాలు ఉంటాయని, ఉమ్మడి జిల్లా నుంచి 14,388 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతుందని, పరీక్షకు వచ్చే అభ్యర్థులు తప్పక నిబంధనలు పాటించాలని సూచించారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

నారాయణపేట రూరల్: పది, ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలు జిల్లాకేంద్రంలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పది విద్యార్థులకు గణితం పరీక్ష జరగగా 516 మందికిగాను 463 మంది హాజరయ్యారు. 53 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఇంటర్ విద్యార్థులకు హిస్టరీ, ఫిజికల్ సైన్స్ పరీక్షలు జరగగా.. 362 మందికిగాను 327 మంది హాజరై 35 మంది గైర్హాజరయ్యారు. పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాలను డీఈఓ లియాకత్ అలీ, టాస్ జిల్లా కో–ఆర్డినేటర్ యాదయ్యశెట్టి తనిఖీ చేశారు.

మే 3 నుంచి 31 వరకు కోర్టులకు సెలవులు

పాలమూరు: ఉమ్మడి జిల్లాలోని కోర్టులకు వచ్చే నెల 3 నుంచి 31 వరకు సెలవులు ప్రకటిస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఉన్న ఆయా కోర్టులలో సెలవు రోజుల్లో అందుబాటులో ఉండటానికి ప్రత్యేకంగా న్యాయమూర్తులకు విధుల కేటాయింపు చేయడం జరిగింది. సెలవుల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా కోర్టులో మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, ఫ్యామిలీ కోర్టు, మూడో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి సూర్యచంద్రకళ మే 3 నుంచి 16 వరకు విధుల్లో ఉంటూ ఫాస్ట్‌ట్రాక్ కేసులకు సంబంధించి అట్రాసిటీ, మహిళపై జరిగే వేధింపుల కేసులు నడుస్తాయి. అలాగే 18 నుంచి 31 వరకు ప్రత్యేక న్యాయమూర్తి ఆర్.శ్రీదేవి, స్పెషల్ సెషన్స్ న్యాయమూర్తి వై.పద్మ అందుబాటులో ఉంటారు. గద్వాల జిల్లాలో మే 3 నుంచి 16 వరకు మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి పి.అన్నెరోస్ క్రిస్టియన్‌తోపాటు నాగర్‌కర్నూల్ ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు ఉంటారు. వనపర్తిలో మే 3 నుంచి 16 వరకు ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎం.రామకృష్ణ సునీతతోపాటు నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు ఉంటారు. నారాయణపేట జిల్లా కోర్టులో మే 18 నుంచి 31 వరకు ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీతోపాటు మహబూబ్‌నగర్ నుంచి ఫ్యామిలీ కోర్టు, మూడో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి సూర్యచంద్రకళ ఉంటారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టులో మే 18 నుంచి 31 వరకు ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి డి.రాజేష్‌బాబుతోపాటు వనపర్తి జిల్లా ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎం.రామకృష్ణ సునీత అందుబాటులో ఉంటారు.

సరిహద్దులోని మద్యం దుకాణాలు బంద్

కృష్ణా/మాగనూరు: జిల్లా సరిహద్దులోని గ్రామాల్లో మే నెల 8 సాయంత్రం 6 నుంచి 10వ తేదీ సాయంత్రం 6 వరకు మద్యం, కల్లు దుకాణాలు మూసి వేయాలని ఎక్సైజ్ సీఐ నాగేందర్‌గౌడ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాల మేరకు నారాయణపేట, ఉట్కూరు, మాగనూర్, కృష్ణా మండలాల్లో కర్ణాటకకు 5 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో మాత్రమే దుకాణాలు మూసివేయాలన్నారు.

నాయీబ్రాహ్మణ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడిగా పాండు

మక్తల్: నాయీబ్రాహ్మణ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడిగా మక్తల్‌కు చెందిన మంగలి పాండు ఎన్నికయ్యారు. శుక్రవారం షాద్‌నగర్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాచమళ్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా పాండును ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రం అందజేశారు.

పెసర క్వింటా రూ.7,629

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పెసర క్వింటాకు గరిష్టంగా రూ.7,629, కనిష్టంగా రూ.6,702 ధర పలికింది. వేరుశనగ రూ.4,300–రూ.3,820.. వరి (హంసరకం) రూ. 1,626–రూ.1,409.. సోనారకం రూ.2,156–రూ.1400.. పత్తి క్వింటా గరిష్టంగా రూ.7,600, కనిష్టంగా రూ.4,500 ధరలు లభించాయి.

ఆందోళన ఉధృతం

డిమాండ్లు పరిష్కరించాలంటూ జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల నిరసన



జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- గ్రామాల్లో నిలిచిపోనున్న సేవలు
- జిల్లావ్యాప్తంగా 178 జేపీఎస్‌లు, 37 ఓపీఎస్‌లు



కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లు (ఫైల్)

నారాయణపేట: తెలంగాణ ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకానికి 2018, ఆగస్టులో నోటిఫికేషన్ విడుదల చేసింది. అక్టోబర్ 10న పరీక్ష నిర్వహించి డిసెంబర్ 18న ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్ 19న ధ్రువపత్రాల పరిశీలన.. 2019, ఏప్రిల్ 12న ఎంపికైన వారికి ఉత్తర్వులు ఇస్తూ మెలిక పెట్టింది. రూ.15 వేల గౌరవ వేతనంతో మూడేళ్ల పాటు ప్రొబేషనరీ పీరియడ్‌తో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇందుకు అంగీకరించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరారు. మూడేళ్లు పూర్తయ్యాక 2021, ఆగస్టులో రూ.15 వేలు ఉన్న గౌరవ వేతనాన్ని రూ.28,719 పెంచుతూ జీఓనంబర్ 26 విడుదల చేసింది.

శాంతియుతంగా నిరవధిక సమ్మె..

నాలుగేళ్లయినా క్రమబద్ధీకరించడం లేదని సంఘం రాష్ట్రశాఖ పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలోని 178 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు 37 మంది ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ నిరవధిక సమ్మెబాట పట్టారు. క్రమబద్ధీకరించి గ్రేడ్–4 కార్యదర్శులుగా గుర్తించాలని, సీనియర్ అసిస్టెంట్ పేస్కేలు ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేస్తూ జిల్లాకేంద్రాల్లో నిరసన ర్యాలీ చేపట్టి కలెక్టర్‌కు డిమాండ్ల వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని చెప్పకనే చెబుతున్నారు.

నాలుగేళ్లయినా రెగ్యులర్ చేయరా?



ఏ ఉద్యోగానికైనా ప్రొబేషనరీ పీరియడ్ రెండేళ్లే ఉంటుంది. కాని నాలుగేళ్లు చేశాం. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులరైజ్ చేయడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. – మౌనిక, గొల్లపల్లి, మక్తల్

నిరవధిక సమ్మెకు దిగాం..



ఉద్యోగ భద్రత కల్పిస్తూ క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరాం. స్పందించకపోవడంతో రాష్ట్రశాఖ పిలుపు మేరకు నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చింది. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం. – అశోక్‌గౌడ్, ఉప్పర్‌పల్లి, మక్తల్

ఇచ్చిన హామీలు అమలుచేయాలి



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలి. పనిచేసిన నాలుగేళ్లను పరిగణలోకి తీసుకొని ఉద్యోగభద్రత కల్పించాలి. ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలి. – శివకుమార్, మద్దెల్‌బీడు, దామరగిద్ద

ఉద్యోగ భద్రత కల్పించాలి..



మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయింది. మరో ఏడాది పెంచినా పనిచేశాం. అయినా ఇంతవరకు క్రమబద్ధీకరించలేదు. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ చేసి ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతున్నాం. – కిశోర్, కొత్తగురవాలింగంపల్లి, మాగనూర్

దళారుల చేతుల్లో మోసపోవద్దు

కలెక్టర్ కోయ శ్రీహర్ష



రైతు నుంచి వినతి స్వీకరించి పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నర్వ: ధరణి సమస్యలపై దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ధరణిలోని భూ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. సంబంధిత ఆర్‌ఐలు, సర్వేయర్‌లను సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైరవీకారులను కార్యాలయానికి రానివ్వొద్దన్నారు. ప్రజావాణిలో తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కాళప్ప, ఆర్‌ఐలు కృష్ణారెడ్డి, అమరేందర్, సర్వేయర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు ప్రక్రియ..

మండలంలో ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష బీఎల్వోలకు సూచించారు. శుక్రవారం స్థానిక రైతువేదికలో ఓటరు నమోదుపై బీఎల్వోలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకటికి రెండుసార్లు పరిశీలించి మరణించిన ఓటరును జాబితా నుంచి తొలగించాలని, డెత్ సర్టిఫికెట్ లేదా ఇంటి యజమాని నుంచి ధ్రువీకరణ తీసుకోవాలన్నారు. రెండ్రోజుల్లో ఓటరు నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.

ఆరోగ్యవాహిని సేవలు అభినందనీయం

నారాయణపేట: జిల్లాలో నిర్వహిస్తున్న ఆరోగ్య వాహిని సేవలు అభినందనీయమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం మండలంలోని భైరంకొండ రైతువేదికలో నిర్వహించిన ఆరోగ్యవాహిని కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 11 నెలలుగా గ్రామపంచాయతీలకు నేరుగా వెళ్లి ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. వైద్యసేవలను మరింత విస్తృతం చేయాలని సభ్యులకు సూచించారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఆరోగ్య వాహినిలో రక్తపరీక్షతో పాటు ఈసీజీ తదితర సౌకర్యాలు బస్సులోనే ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఆరోగ్య వాహిని సభ్యుడు సాయిప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మోసటి జ్యోతి



మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ మొసటి జ్యోతి

నారాయణపేట: రైతు సంక్షేమమే ధ్యేయంగా కొత్త పాలకవర్గం పనిచేస్తుందని చైర్‌పర్సన్ మోసటి జ్యోతి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మార్కెట్ పాలకవర్గం తొలి సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొసటి జ్యోతి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసినందుకుగాను ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ఎజెండాలో తొలి తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ ఆదాయాన్ని పెంచాలని రెండో తీర్మానం ప్రవేశపెట్టారు. మార్కెట్‌యార్డు కార్యాలయ భవనంపై చైర్‌పర్సన్ చాంబర్, సమావేశ మందిరం నిర్మించాలని మూడోతీర్మానం ప్రవేశపెట్టారు. వీటితోపాటు మార్కెట్‌యార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయిస్తూ మొత్తం తీర్మానాలను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది.

– పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు రైతులకు ఇబ్బందులు కలగకుండా యార్డులో సౌకర్యాలు కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తోందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, డీఏఓ జాన్‌సుధాకర్, యార్డు కార్యదర్శి చంద్రశేఖర్, మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, పాలకవర్గ సభ్యులు మధుసూదన్, కాకర్ల నారాయణమ్మ, అవిటి జగదీశ్, హనుమాన్‌ధారక్, కొండారెడ్డి, హన్మంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

'సాక్షి' కథనంపై స్పందించిన పాలకవర్గం..

మార్కెట్‌యార్డులో నెలకొన్న సమస్యలపై శుక్రవారం ప్రచురితమైన 'సమస్యల స్వాగతం' అనే వార్తకు పాలకవర్గం స్పందించింది. మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి కార్యదర్శి చంద్రశేఖర్‌తో సమస్యలపై చర్చించారు. రైతు విశ్రాంతి భవనం, వేయింగ్ మిషన్, ప్రహరీ నిర్మాణం, తక్‌పట్టీలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు విశ్రాంతి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, ఖాళీ స్థలంలో షెడ్లు నిర్మిస్తే ధాన్యం తడిసిపోకుండా ఉంటుందని సమావేశంలో చర్చించారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

హైకోర్టు న్యాయమూర్తి ఎం.లక్ష్మణ్

పాలమూరు: కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు చొరవ చూపాలని హైకోర్టు న్యాయమూర్తి, మహబూబ్‌నగర్ జిల్లా పోర్టు పోలియో న్యాయమూర్తి ఎం.లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో శుక్రవారం రాత్రి జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్యువల్ డే కార్యక్రమం నిర్వహించారు. కోర్టుకు వచ్చిన వివాదాలు కేసులుగా మారి కోర్టులో కొనసాగుతున్నప్పుడు వాటిని త్వరితగతిన పరిష్కరించడం ఎలా అనే అంశాన్ని మొదట న్యాయవాదులు ఆ తర్వాత న్యాయాధికారులు ఆలోచించాలని సూచించారు. కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను తాము చూస్తున్నామని చెప్పారు. కక్షిదారునికి సాధ్యమైనంత త్వరలో పరిష్కారం లభించే విషయాన్ని న్యాయమూర్తి, అధికారులు కూడా ఆలోచించాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఖాళీగా ఉన్న న్యాయాధికారుల భర్తీ చేసేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త కోర్టుల అవసరం ఎంతో ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సైతం కొత్త కోర్టుల నిర్మాణానికి సంబంధించి నిధుల విడుదల విషయమై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ప్రధాన కార్యదర్శితో చర్చించానని చెప్పారు. జూనియర్ న్యాయవాదులు తమ నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. అంతకు ముందు కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి పి.మాధవిదేవి మాట్లాడుతూ పాలమూరు అంటేనే పాలవంటి మనసు గల జిల్లా అన్నారు. కరువు జిల్లా అనే పేరును మనమే దూరం చేసేందుకు ప్రతిజ్ఞ క్యరూ పాటుపడాలన్నారు. న్యాయవాదులు తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలని, జూనియర్ న్యాయవాదులు వృత్తిలో పట్టుసాధించి, నిత్యం కోర్టులో ఉంటూ సీనియర్ల వాదన, కేసు నడిపే తీరును సమీక్షించాలన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లోని పలు కోర్టుల్లో న్యాయమూర్తుల భర్తీ ప్రక్రియ వెంటనే చేపట్టాలని, 41 సీఆర్‌పీసీ అంశాన్ని పునఃపరిశీలించాలని, జూనియర్ న్యాయవాదుల వృత్తి శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం న్యాయమూర్తులను న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా

ఎస్పీ వెంకటేశ్వర్లు



తీలేరు స్టేజీ దగ్గర స్పీడ్‌గన్‌తో వాహనాల వేగం పరిశీలిస్తున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

మరికల్: రహదారి నిబంధనలు అతిక్రమించి జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా నడిపితే స్పీడ్‌గన్‌తో జరిమానా విధించాలని ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని లాల్‌కోటచౌరస్తా నుంచి మక్తల్ మండలం జక్లేర్ వరకు ఉన్న జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను ఆయన పరిశీలించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో బారికేడ్లు, గ్రామాల నుంచి వచ్చే రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ రహదారిపై వాహనాలు నిలపకుండా చూడాలన్నారు. రహదారి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపొద్దని.. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనవెంట సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

10 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

డీవైఎస్‌ఓ కృష్ణమాచారి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీవైఎస్‌ఓ కృష్ణమాచారి

నారాయణపేట రూరల్: జిల్లావ్యాప్తంగా 10 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీవైఎస్‌ఓ కృష్ణమాచారి తెలిపారు. శుక్రవారం సీనియర్ క్రీడాకారులు, పీఈటీలతో స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మే నెల 1న ప్రారంభించి 31వ తేదీ వరకు కొనసాగించాలని, 14 ఏళ్లలోపు చిన్నారులకు ఎంపిక చేసిన క్రీడల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. రోజు ఉదయం 5.30 నుంచి 7 వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 వరకు శిబిరాలు కొనసాగించాలని తెలిపారు. నారాయణపేట, మక్తల్‌లో యోగా, పెదిరిపాడు, ధన్వాడ, మక్తల్‌లో ఖో–ఖో, ఊట్కూర్, గుండుమాల్, జాజాపూర్‌లో వాలీబాల్, కాన్‌కుర్తిలో కబడ్డీ, నారాయణపేటలో అథ్లెటిక్స్ శిబిరాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చామన్నారు. సమావేశంలో రమణ, సాయినాథ్, బాలరాజు, అంబరీష్, సురేష్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



పోలీస్ పరేడ్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

డీఎస్పీ సత్యనారాయణ

ఊట్కూరు: సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎస్పీ సత్యనారాయణ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని, విలేజ్ ఆఫీసర్స్ వారికి కేటాయించిన గ్రామాల్లో విధిగా పర్యటించాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వారానికి ఒకరోజు శ్రమదానం చేయాలన్నారు. ఠాణాకు వచ్చే బాధితులకు న్యాయం జరిగే చూడాలని, ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచరాదని కోరారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సీతయ్య, ఎస్‌ఐలు రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన అవినీతి చేపలు



జడ్చర్లలోని తహసీల్దార్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

- రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇచ్చేందుకు రూ.లక్ష డిమాండ్
- రూ.75 వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం
- చారకొండ తహసీల్దార్, ధరణి ఆపరేటర్, వీఆర్‌ఏ భర్త అరెస్ట్



ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు



నాగమణి, తహసీల్దార్, చారకొండ

సాక్షి, నాగర్‌కర్నూల్/ చారకొండ/ జడ్చర్ల: ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇచ్చేందుకు రూ.లక్ష డిమాండ్ చేసి వీఆర్‌ఏ భర్త ద్వారా లంచం తీసుకుంటూ తహసీల్దార్ ఏసీబీకి చిక్కిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండలో శుక్రవారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మాతృభూమి డెవలపర్స్ సంస్థ నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి శివారులో 12 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. అనంతరం సదరు భూమిని 12 మంది వ్యక్తులకు విక్రయించింది. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కోసం సంస్థ ప్రతినిధిగా ఉన్న రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం సంకటోనిపల్లికి చెందిన తాళ్ల రవీందర్ చారకొండ తహసీల్దార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ కోసం ఫిబ్రవరి 7న దరఖాస్తు చేసుకున్నాడు. అయితే రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు పెండింగ్‌లో ఉంచుతూ వచ్చారు. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.25 వేల చొప్పున రూ.లక్ష లంచంగా ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని తహసీల్దార్ నాగమణి, ధరణి ఆపరేటర్ రాజు స్పష్టం చేశారు. ఫిబ్రవరి 14న నలుగురు వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ పూర్తయింది. ఇందుకు సంబంధించిన డబ్బులు రూ.75 వేలు తహసీల్దార్‌కు, రూ.25 వేలు ధరణి ఆపరేటర్‌కు ఇస్తేనే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇస్తామని రెండు నెలలుగా పెండింగ్‌లో ఉంచారు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు రవీందర్ శుక్రవారం తహసీల్దార్ నాగమణి సూచన మేరకు చారకొండ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సిర్సనగండ్ల వీఆర్‌ఏ భర్త వెంకటయ్యకు రూ.75 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు వీఆర్‌ఏ భర్త వెంకటయ్యతో పాటు ధరణి ఆపరేటర్ రాజు, తహసీల్దార్ నాగమణిని అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు.

తహసీల్దార్ ఇంట్లో సోదాలు..

జడ్చర్ల బాలాజీనగర్‌లో ఉంటున్న తహసీల్దార్ నాగమణి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆమె భర్త మాల్యానాయక్ జడ్చర్లలో ఐకేపీ ఏపీఎంగా విధులు నిర్వర్తిస్తుండగా ఆయనను అడిగి పలు వివరాలు సేకరించారు. ఇంట్లో ఉన్న బంగారు నగలను స్వాధీనపర్చుకున్నారు. ప్లాట్లకు సంబంధించిన పలు డాక్యుమెంట్లతో పాటు ఇతర ఆస్తులను గుర్తించినట్లు తెలిసింది. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని అధికారులు విలేకరులకు తెలిపారు.

కర్ణాటకకు తరలుతున్న ధాన్యం

- మద్ధతు ధర తక్కువే కారణం
- నది పరివాహక ప్రాంతంలో ఒక్కో రైతు వందల ఎకరాల్లో సాగు
- రాయచూర్ మార్కెట్‌లో సన్నరకం ధాన్యంకు రూ.2,450
- రాష్ట్ర ప్రభుత్వ మద్దతు ధర రూ.2,040 నుంచి రూ.2,060


గుడెబల్లూర్ శివారులో రైతుల కల్లాలో నిల్వ ఉంచిన ధాన్యం

కృష్ణా: గతంలో కర్ణాటక నుంచి తెలంగాణకు ధాన్యం వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఇక్కడి ధాన్యాన్నే కర్ణాటకకు తరలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంకా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. ఇప్పటికే కర్ణాటక సరిహద్దు మండలాల్లో 80 శాతం వరి ధాన్యం తరలిపోయింది. ఇక కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఉపయోగం ఉండదని అధికారులే అంటుండడం విశేషం.

నారాయణపేట జిల్లాలోనే కృష్ణా మండలంలో అతి ఎక్కువగా వరి సాగు చేస్తారు. ఇక్కడ పండే ధాన్యానికి విలువ ఎక్కువ. అందుకే పక్కన ఉన్న కర్ణాటకలోని రాయచూర్ వ్యవసాయ మార్కెట్ వారు, మిల్లర్లు ఈ ప్రాంత రైతుల పొలాల వద్దకు వచ్చి ధాన్యం కొంటున్నారు. అందులో ప్రభుత్వం అందించే మద్దతు ధర తక్కువగా ఉండడంతోనూ రైతులు ప్రైవేట్ మిల్లర్లవైపే మొగ్గు చూపుతున్నారు.

10,638 ఎకరాల్లో సాగు

మండలంలో ఈసారి 10,638 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు 29 క్వింటాళ్ల చొప్పున, మొత్తం మండలంలో 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తున్నారని వ్యవసాయ అధికారుల అంచనా. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు వీటిలో కనీసం ఒక శాతం ధాన్యం కూడా వచ్చే అవకాశం లేదని చెప్పొచ్చు. గతేడాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు కేవలం 16వేల క్వింటాళ్ల మాత్రమే ధాన్యం చేరింది. గతేడాది ప్రభుత్వ మద్దతు ధర, ప్రైవేట్ మిల్లర్లు ఇచ్చే ధర సమానంగా ఉన్నప్పుడే ఆ పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ప్రభుత్వ ఇచ్చే మద్దతు ధరకు, మిల్లర్లు ఇచ్చే ధరకు క్వింటాల్‌కు కనీసం రూ.450 తేడా ఉంది. రైతులకు రవాణా, హమాలి, ఇతరత్ర ఖర్చులు కూడా కలిసివస్తున్నాయి. అందుకే ఈ ప్రాంతంలో పండించే ధాన్యాన్ని రాయచూర్ మిల్లర్లు రైతుల కల్లాల్లోనే కొంటున్నారు.


కృష్ణా మండలం నుంచి కర్ణాటకకు లారీల్లో వెళ్తున్న వరి ధాన్యం

సరిహద్దు మండలాల్లో ఇదే పరిస్థితి..

జోగుళాంబ గద్వాల జిల్లాలోని కర్ణాటక సరిహద్దు మండలాలైన గట్టు, కేటీదొడ్డి, అయిజలోని వరి ధాన్యాన్ని కూడా రాయచూర్ మిల్లర్లు రైతుల కల్లాలోనే కొంటున్నారు. గట్టు మండలంలో మొత్తం 9,650 ఎకరాల్లో వరి సాగు చేయగా 3.85లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం ఇక్కడి రైతులు పండిస్తున్నారు. ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనేందుకు వారం రోజుల క్రితం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కేంద్రాలకు రాకపోవడంతో అక్కడి పరిస్థితి అర్థం అవుతుంది. కేటీదొడ్డి మండలంలో 10,612 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం మూలంగా రైతులు తమ ధాన్యాన్ని రాయచూర్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.

పొలాల వద్దే..


ధర ఎక్కువగా ఇవ్వడంతో పాటు పొలాల వద్దే మా ధాన్యం కొంటున్నారు. కర్ణాటకలోని రాయచూర్ మార్కెట్ మిల్లర్లు మా పొలాల వద్దకు వస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర తక్కువగా ఉండడంతో పాటు అదనపు ఖర్చులు అవుతున్నాయి. అందుకే గతేడాది నుంచి మిల్లర్లకే విక్రయిస్తున్నాం. నేను దాదాపు 150 ఎకరాల్లో వరి సాగు చేశాను.

– సంతోష్‌శెట్టి, రైతు, గుడెబల్లూర్

డబ్బులు వెంటనే..


ధరలు ఎక్కువగా ఉండడంతో పాటు డబ్బులు వెంటనే ఇస్తున్నారు. మిల్లర్లు ప్రభుత్వం కంటే అధిక ధరలు ఇస్తున్నారు. పైగా మాకు రవాణా, హమాలీ ఖర్చులు కూడా మిగులుతున్నాయి. అందుకే మేము మిల్లర్లకు ఇస్తున్నాం.

– కొండయ్య, రైతు, కేటీదొడ్డి మండలం

వారంలో కేంద్రాలను ఏర్పాటు చేస్తాం


కృష్ణా మండలంలో మొత్తం ఐదు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ వారంలో ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కర్ణాటకలో సన్నరకం ధాన్యానికి మేము ఇచ్చే ధరల కంటే ఎక్కువగా ఉన్నాయి. అందుకే రైతులు ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు. రాయచూర్ మిల్లర్లకు రెండేళ్లుగా ఈ ప్రాంతంలో ధాన్యం లభించకపోవడంతో వారికి కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయి. అందుకే వారు ఈసారి ముందే జాగ్రత్త పడుతున్నారు.

– సుదర్శన్‌గౌడ్, వ్యవసాయ అధికారి, కృష్ణా మండలం

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బల్మూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పొలిశెట్టిపల్లి గేటు సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలకపల్లి మండలం రాయిపాకులకు చెందిన వెంకటయ్య(45) మరో వ్యక్తి స్వామితో కలిసి అచ్చంపేటలో చనిపోయిన బంధువు కుటుంబ సభ్యులను పరామర్శించి తిరిగి తన బైక్‌పై బయలుదేరాడు. పొలిశెట్టిపల్లి స్టేజీవద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ వెంకటయ్య, స్వామిని కుటుంబసభ్యులు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వెంకటయ్య మృతి చెందాడు. స్వామి చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ..

జడ్చర్ల: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉదండాపూర్ చెందిన గొడు గు కుర్మయ్య(48) గురువారం శివారులోని నేరెడుచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వల విసిరే సమయంలో వల కాళ్లకు, నడుముకు చుట్టుకోవడంతో చెరువులో పడి మునిగి పోయాడు. శుక్రవారం మృతదేహం చెరువులో తేలగా బయటకు తీశారు. మృతుడి భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగు పడి మహిళ..


బొజ్జమ్మ (ఫైల్)

వంగూరు: మండలంలోని చాకలిగుడిసెలకు చెందిన చిలుకేశ్వరం బొజ్జమ్మ(46) పిడుగుపాటుకు గురై మృతిచెందింది. శుక్రవారం సాయంత్రం పొలంలో వేరుశనగ పంటను మిషన్ ద్వారా తీస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు పిడుగుపడి ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ప్రమాదస్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

మనస్తాపంతో బాలుడు బలవన్మరణం

జడ్చర్ల: మండలంలోని నసరుల్లాబాద్‌లో తండ్రి మృతితో మానసికంగా తీవ్ర మనస్తాపానికి గురైన కుమారుడు ఇంట్లో ఉరేసుకున్నాడు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నసరుల్లాబాద్‌కు చెందిన మశగల్ల ఆనంద్(17) ఇటీవల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు రాశాడు. ఆరు నెలల కిందట తండ్రి జంగయ్య మృతి చెందడంతో అప్పటి నుంచి ఆనంద్ తీవ్ర మనస్తాపానికి గురై మానసిక ఆందోళనలో ఉన్నాడు. తల్లి సుజాత ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఆనంద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని వాచ్‌మన్..

బిజినేపల్లి: మండల కేంద్రంలో వాచ్‌మన్ తాను పని చేసే ఇంట్లో గురువారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తికి చెందిన భీమయ్య (55) మండల కేంద్రంలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. మండల కేంద్రంలోనే ఒక ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తూ, ఆ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేశారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని భార్య కోటమ్మ ఫిర్యాదులో పేర్కొందని పోలీసులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

అచ్చంపేట రూరల్: బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై పోక్సోచట్టం కింద కేసు నమోదు చేశారు. శుక్రవారం యువకుడిని రిమాండ్‌కు పంపారు. ఎస్‌ఐ గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం... బాలికకు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడని, బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం శుక్రవారం కేతావత్ తులసీరాంను పట్టుకున్నామని తెలిపారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

మొన్న తల్లి.. నిన్న చిన్నారి

- కల్వకుర్తి సీహెచ్‌సీ ఘటనలో విషాదం

కల్వకుర్తి టౌన్: తల్లి మరణించిన మరుసటి రోజే నవజాత శిశువు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. గురువారం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రాజేశ్వరి (27) సీహెచ్‌సీలో కాన్పు తర్వాత బీపీ, మూర్ఛ రావటంతో మృతి చెందింది. పరిస్థితి విషమంగా ఉండటంతో తల్లితో పాటుగా, నవజాత శిశువును హైదరాబాద్‌లోని నీలోఫర్‌కు తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం అక్కడి నుంచి శిశువు తండ్రికి ఫోన్‌చేశారు. ఆస్పత్రికి వారి కుటుంబసభ్యులు వెళ్తుండగా మార్గమధ్యలోనే శిశువు మృతి చెందిందన్న విషయాన్ని వారి బంధువులు ఫోన్‌ద్వారా తెలిపారు. ఆస్పత్రికి వెళ్లి శిశువును తీసుకొనివచ్చి కల్వకుర్తిలో అంత్యక్రియలు పూర్తిచేశారు. గురువారం తల్లి, శుక్రవారం శిశువు మరణించటంతో భర్తతో పాటుగా, వారి కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇప్పటికి బాలింత మృతిలో చాలా అనుమానాలున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

ఇంట్లో చోరీ

వనపర్తి: జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రాంతానికి చెందిన యాదగిరి ఈనెల 23న ఇంటికి తాళం వెసి తన కుమారుడి వద్దకు వెళ్లాడు. శుక్రవారం ఇంటికి వచ్చి తాళం తీసి చూస్తే.. గుర్తుతెలియని వ్యక్తులు వంట గది కిటికిలో నుంచి ఇంట్లోకి చొరబడి బీరువాలోని 3 తులాల బంగారం, 30 తులాల వెండిని చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో హార్వెస్టర్ డ్రైవర్ మృతి


కేశవులు(ఫైల్)

నవాబుపేట: బాబు పుట్టాడన్న సంతోషం.. రోజులు గడవక ముందే తన పసిబిడ్డ బోసి నవ్వులకు దూరమయ్యాడు ఓ తండ్రి. నెల రోజులు నిండని బిడ్డను, బాలింతను వదిలి త్వరగా తిరిగి వస్తానంటూ ఉపాధి కోసం వెళ్లిన ఓ వ్యక్తి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. ఈ విషాదకర సంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని గురుకుంట పంచాయతీ పరిధిలోని పల్లెమోనిదొడ్లకు చెందిన పల్లెమోని కేశవులు(25), నవాబుపేటకు చెందిన అశ్వినికి ఏడాది క్రితం వివాహమైంది. వీరికి ఈ నెల 9న బాబు జన్మించాడు. కేశవులు సొంతంగా వరికోత మిషన్ హార్వెస్టర్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వారం రోజులు ఇంటిపాటున ఉన్న కేశవులు వరి కోతలు మొదలు కావడంతో వారం రోజుల క్రితం వరికోత మిషన్ నడిపేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పెద్దకొండూర్ పంచాయతీ మధిర తమ్మలోనిబావికి వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి వరకు వలిగొండ మండలం వర్కట్‌పల్లిలో మిషన్ నడిపించాడు. ఆ తర్వాత చౌటుప్పల్‌కు వెళ్లే క్రమంలో తమ్మలోనిబావి శివారులో విద్యుత్ లైన్ హార్వెస్టర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై కేశవులు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ సీత పాండు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే తన కొడుకును చూసేందుకు ఇంటికి వద్దామనుకున్న తరుణంలోనే మృతి చెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

మంగలికుంటపల్లిలో మరొకరు..

బల్మూర్: మండలంలోని మంగలికుంటపల్లికు చెందిన కొల్ల తిర్పతయ్య(35) విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తుమ్మన్‌పేటలో ఓ ఇంటి నిర్మాణం పనులు చేస్తుండగా సర్వీస్ వైర్ తగిలి కింద పడిపోయాడు. చుట్టుపక్కల ఉన్న వారు వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య కళమని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్బులు రెట్టింపు చేస్తామని మోసం



మాగనూర్: మండల కేంద్రంలో మరో భారీ ఆన్‌లైన్ మోసం బయటపడింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని కేటుగాళ్ల మాయాల్లో దాదాపు 40 మందికి పైగా చిక్కుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొందరి బాధితుల కథనం ప్రకారం.. సోలో పవర్ వరల్డ్ (ఆన్‌లైన్)యాప్‌లో రూ. 20 వేలు పట్టుబడి పెడితే రోజుకు రూ.960 చొప్పున అకౌంట్‌లో పడుతాయని, 185 రోజులకు రూ. 1,78,800 వస్తాయని నమ్మించారు. మొదట్లో కొందరి అకౌంట్లో రోజు వారి డబ్బులు జమ అయ్యాయి. గ్రామంలో ఒకరి నుంచి మరొకరికి విషయం పాకడంతో ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు పెట్టుబడి పెట్టారు. ఇలా దాదాపు రూ.8లక్షల వరకు డబ్బులు యాప్‌లో పోగొట్టుకున్నట్లు తెలుసుకుని లబోదిబోమంటున్నారు. చివరికి వారం రోజులుగా యాప్ ఆన్‌లైన్‌లో ఓపెన్ కాకపోవడం, బయటకు చెబితే పరువుపోతుందని భయపడుతూ, ఈ మోసాన్ని బయటకు రాకుండా చూస్తున్నట్లు గ్రామంలో గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి.

వాట్సాప్ లింక్ నొక్కారు.. రూ.లక్షలు మాయం

అచ్చంపేట రూరల్: పార్ట్ టైం జాబ్‌లు ఉన్నాయని వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించిన యువకుడి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు డ్రా అయ్యాయి. పట్టణంలోని మహేంద్రనగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్ వాట్సాప్‌కు పార్ట్ టైం జాబ్ ఉందని ఓ నెంబర్ నుంచి లింక్ వచ్చింది. స్పందించిన యువకుడు చాటింగ్ కొనసాగించాడు. మొదట వచ్చిన లింక్‌ను నొక్కితే రూ. వెయ్యి వచ్చాయి. ఇలా రెండు, మూడు పర్యాయాలు డబ్బులు వచ్చాక మరో లింక్‌ను నొక్కడంతో ఈనెల 20న అతని ఖాతా నుంచి రూ. 1.40లక్షలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో మోసపోయానని గ్రహించాడు. శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ గోవర్ధన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అపరిచిత కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని ఎస్‌ఐ సూచించారు.

సైబర్‌వలలో రూ.94వేల మోసం

వనపర్తి: ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేయడంతో తన అకౌంట్‌లో ఉన్న నగదు మాయమైపోయాయి. పట్టణ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాసులు సెల్‌ఫోన్‌కు ఈనెల 22న వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దాని లింక్ క్లిక్ చేసిన అతని అకౌంట్‌లో నుంచి రూ.94వేల నగదు డ్రా అయ్యాయి. అకౌంట్‌లో బ్యాలెన్స్ చెక్ చేసుకోగా మోసపోయానని తెలుసుకుని శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత



అచ్చంపేట రూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న నలుగురి ఫోన్లను శుక్రవారం సీఐ అనుదీప్, ఎస్‌ఐలు గోవర్ధన్, రవి వారికి తిరిగి అప్పగించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతికొద్ది సమయంలో టెక్ టీం సిబ్బంది అనిల్‌కుమార్‌గౌడ్, మహేష్ సెల్‌ఫోన్లను కనుగొన్నారు. శుక్రవారం బాధితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఫోన్లను అప్పగించారు.

అమ్రాబాద్: పదర మండల కేంద్రానికి చెందిన అజయ్ మొబైల్ మూడు నెలల కింద పోగొట్టుకోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫోన్‌ను గుర్తించిన పోలీసులు శుక్రవారం అజయ్‌కు తిరిగి అప్పగించారు.

బీరప్ప ఆలయం కూల్చివేత

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న బీరప్ప ఆలయాన్ని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు శుక్రవారం సాయంత్రం కూల్చివేశారని అమిస్తాపూర్‌కు చెందిన నర్సింహులు, శ్యాంసుందర్, సంజీవ్ కుమార్, శ్రీధర్ తెలిపారు. అమిస్తాపూర్‌కు చెందిన కుర్వ కులస్తులు 70ఏళ్ల నుంచి పోతులమడుగు శివారులోని జాతీయ రహదారి పక్కన పెద్ద రాళ్ల కుప్పపై ఏటా పూజలు చేసి, నైవేద్యం పెడతారని తెలిపారు. తమ కులస్తులకు సమాచారం లేకుండా ఆలయాన్ని కూల్చడం సరికాదని, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



ఏడాది తర్వాత తిరిగొచ్చిన బాలుడు

- అదృశ్యమైన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


బాలుడి తల్లిదండ్రులతో ఎస్‌ఐ నాగన్న, సిబ్బంది

పాన్‌గల్: మండలంలో అదృశ్యమైన బాలుడిని స్థానిక పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొండాయిపల్లి తండాకు చెందిన శాంతమ్మ, నర్సింహనాయక్ దంపతుల కుమారుడు శ్రీనివాస్‌నాయక్ తండా సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్నాడు. గతేడాది మే నెల 6వ తేదీన ఇంటి నుంచి తప్పిపోయాడు. ఈ సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఏపీ రాష్ట్రంలోని కర్నూల్ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం కనిపించడంతో బాలుడిని సమీపంలోని చైల్డ్ వెల్ఫేర్ కేంద్రానికి తరలించారు. బాలుడు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి చైల్డ్ వెల్ఫేర్ కేంద్రంకి సమాచారం ఇచ్చారు. విషయం పోలీసులకు తెలపడంతో కర్నూల్ నుంచి బాలుడిని వనపర్తికి తీసుకువచ్చారు. బాలుడిని శుక్రవారం ఎస్‌ఐ దొండాయిపల్లితండాకు సిబ్బందితో వెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు పిల్లల చదువు, పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారి కోసం కొంత సమయం కేటాయించి బాగుగోలను తెలుసుకోవాలని ఎస్‌ఐ వారికి సూచించారు.

ఇద్దరి మృతికి కారణమైన నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, చిత్రంలో నిందితులు

నారాయణపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి మృతికి కారణమైన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రవిబాబు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బాపునగర్ చెందిన సోమరి శంక్రప్ప (62) సింగారంగేట్ సమీపంలోని ద్వారక స్కూల్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. ఈ నెల 13న రాత్రి తన మనువడు వరుణ్ (8)తో కలిసి విధులకు వెళ్లి తిరిగి తన ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ నుంచి షుగర్‌లోడ్‌తో లారీ ఒరిస్సా రాష్ట్రానికి వెళ్తుంది. డ్రైవర్ నిర్లక్ష్యంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వారిద్దరూ మృతి చెందారు. చీకట్లో ఎవరూ గుర్తించరనే ఉద్దేశంతో డ్రైవర్ తప్పించుకుని పోయాడు. పోలీసులు రహదారిలోని సీసీ కెమెరాలను పరిశీలించగా నంబర్ మాత్రం గుర్తించలేకపోయారు. లారీ ఆనవాలతో ఉమ్మడి జిల్లాలోని పలు రూట్లలో సీసీ కెమెరాలు, టోల్‌గేట్లను పరిశీలించారు. మిడ్జిల్ మండలం మన్ననూర్ టోల్‌గేట్ వద్ద లారీని గుర్తించారు. వెంటనే విచారణ చేయగా డ్రైవర్, క్లీనర్ ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన మధురెడ్డి, రామకృష్ణగా గుర్తించారు. లారీని ఎస్‌ఐ సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నారాయణపేటకు తీసుకుని వచ్చారు.

ప్రయాణికుడిపై దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

మహబూబ్‌నగర్ క్రైం: ఆటోలో ఎక్కిన ప్రయాణికుడిపై దాడి చేసి డబ్బులు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన కేసులో ముగ్గురు మైనర్లను, మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా గౌతపూర్ చెందిన రవికుమార్ కర్నూల్‌లో ఉన్న అతని బావ వద్దకు వెళ్లేందుకు ఈనెల 27న తెల్లవారుజామున 1:30ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ చౌరస్తాలో భూత్పూర్ వెళ్లే ఆటో ఎక్కాడు. అప్పటికే ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. ఆ తర్వాత డ్రైవర్ క్రిస్టియన్‌పల్లి దాటిన తర్వాత ఆటోను బైపాస్ రోడ్డులో కొంతదూరం తీసుకెళ్లి నిలిపారు. మూత్రం వస్తుంది.. కిందకు దిగమని చెప్పి రవికుమార్‌పై దాడి చేశారు. ఆ తర్వాత అతని వద్ద ఉన్న రూ.30వేల నగదు, సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి ఆటోలో పరారయ్యారు. బాధితుడు రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో పట్టణంలోని బండ్లగేరికి చెందిన భానుప్రకాష్, నవీన్‌కుమార్, ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.30 వేల నగదు, సెల్‌ఫోన్ రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరికరాల శుభ్రంతో సేద్యం సులభం

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: బిందు సేద్యం పరికరాలను సకాలంలో శుభ్రం చేసుకోవడం వలన మన్నికతోపాటుగా నీటి పారుదల బాగుంటుందని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. వంద అడుగులకుపైగా పడిపోయిన భూగర్భ జలాల నుంచి వచ్చే సన్నటి మట్టి, ఎరువులు బిందు సేద్యం పరికరాలను దెబ్బతీస్తాయి. దీంతో మోటార్లపై భారం పడి దెబ్బతినే అవకాశం ఉంది. బిందు సేద్య పరికరాలను భద్రపరిచేందుకు, శుభ్రపర్చుకోవడానికి పలు సూచనలు వివరించారు.

స్క్రీన్ ఫిల్టర్ శుభ్రత కీలకం

బోరు బావుల నుంచి వచ్చే నీటితో సన్నటి మట్టి అధికంగా ఉంటుంది. దీంతో లేటర్ పైపుల నుంచి నీరు వచ్చే మార్గాలు మూసుకపోతాయి. దీని నివారణకు బోరు వద్ద నుంచి లేటరల్ పైపులకు నీరు వచ్చే ముందు స్క్రీన్ ఫిల్టర్‌ను అమర్చుతారు. దీన్ని వారం రోజులకు ఒక సారి నీటితో శుభ్ర పరుచుకోవాలి. ఫిల్టర్‌పై సన్నటి రంధ్రాలు పూడిపోకుండా చూసుకోవాలి. కొత్తగా వేసిన బోర్లు అయితే రోజుకు ఒకసారైనా ఫిల్టర్‌ను శుభ్రం చేసుకోవడం మంచిది.

లెటరల్ పైపులకు యాసిడ్ ట్రీట్‌మెంట్

బిందు సేద్య పరికరాల ద్వారా అందించే ఎరువుల వల్ల లేటరల్ పైపులకున్న రంధ్రాలు పూడుకుపోతాయి. తద్వార నీరు కిందికి రావడం నిలిచిపోయి మొక్కలకు నీరు అందదు. ఏడాదికి ఒక సారి పైపులను శుభ్రపర్చుకోవాలి. ఇందుకోసం తక్కువ గాడత గల హైడ్రోక్లోరిక్ లేదా సల్ఫూరిక్ ఆసిడ్‌ను వాడతారు. ఆసిడ్‌ను ఉపయోగించి పైపులను శుభ్రపరిచేందుకు రెండు పద్ధతులను పాటించవచ్చు. పంట లేని సమయంలో లేటరల్ పైపులను శుభ్రపరుచుకోవాలి. ఎకరా పొలంలో గల లేటరల్ పైపులను శుభ్రపరిచేందుకు 30 నుంచి 40 లీటర్ల హైడ్రోక్లోరిక్ యాసిడ్‌ను కొనుగోలు చేసుకోవాలి. 10మీటర్ల హౌస్ పైపును యూ ఆకారంలో ఉండేలా అమర్చుకోవాలి. ఇందుకోసం రెండు వైపుల కట్టెలను పాతి వాటికి హౌస్ పైపును కట్టాలి. పైపు యాసిడ్‌ను ఉంచాలి. గాడత తక్కువ గల యాసిడ్‌ను మాత్రమే మార్కెట్‌లో విక్రయిస్తారు. కాబట్టి అందులో నీటిని కలపాల్సిన అవసరం ఉండదు. హౌస్ పైపు ఒక వైపు నుంచి నాలుగేసి లేటరల్ పైపులను జాగ్రత్తగా బయటికి తీసుకోవాలి. ఆపై పైపులను రెండు రోజుల పాటు వాడకుండా వదిలేయాలి. మూడవ రోజు సబ్ లైన్‌కు బిగించి నీటిని వదిలివేయాలి. ఆపై ఒక రోజు తర్వాత మొక్కలకు నీరు అందించడానికి పైపులను బిగించాలి.

రెండవ పద్ధతిలో ఎరువులను వదిలే ప్లాస్టిక్ ఫెర్టిగేషన్ ట్యాంకు ద్వారా శుభ్రపర్చడం. పంట లేని సమయాల్లో మాత్రమే ఈ పద్ధతిని అవలంభించాలి. ప్లాస్టిక్ ఫెర్టిగేషన్ ట్యాంకును ముందుగా శుభ్రపర్చుకోవాలి. ఆపై తక్కువ గాడత గల యాసిడ్‌ను అందులో నింపాలి. తర్వాత నీటిని అందులో పంపాలి. ఆపై గేట్ వాల్వ్‌ను నియంత్రిస్తూ యాసిడ్ ఉన్న నీటిని మెయిన్ లైన్ గుండా సబ్ లైన్ ద్వారా లేటరల్ పైపులకు పంపాలి. ఇందుకోసం ఎక్కడా లీకేజీ లేకుండా చూసుకోవాలి. ఇనుప ఫెర్టిగేషన్ ట్యాంకు ఉన్నట్లయితే వెంచురి సాయంతో లేటరల్ పైపులను శుభ్రం చేసుకోవడం ఉత్తమం. అరగంటపాటు యాసిడ్ ప్రక్రియ సాగితే లేటర్ పైపులకు ఉన్న చిన్న రంధ్రాల్లో మలినాలు తొలగిపోయి పూర్తి స్థాయిలో శుభ్రపడుతాయి.


పొలంలో ఏర్పాటు చేసిన డ్రిప్

జాగ్రత్తలు

- పంటలు ఉన్న సమయాల్లో యాసిడ్ ద్వారా పైపులను శుభ్రపరుచుకోరాదు.
- డ్రిప్ కంపెనీలు సూచించిన యాసిడ్‌ను వారు నిర్ధేశించిన మోతాదు మేరకే వాడాలి.
- నీటిలో యాసిడ్‌ను కలపాలి. అంతేకాని యాసిడ్ ఉన్న ట్యాంకులో నీటిని ధారపోసే ప్రయత్నం చేయరాదు.
- ఫెర్టిగేషన్ లేదా వెంచురీ సాయంతో యాసిడ్‌ను పంపేటప్పుడు నీటిని వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పైపులు శుభ్రపడిన అనంతరం ఎండ్ క్యాప్‌లను తీసేసి యాసిడ్ కలిపిన నీటిని వదిలేయాలి.
- శుభ్రపరిచిన పైపులను సైతం మరో మారు నీటితో కడగడం లేదా సబ్‌లైన్‌కు బిగించి నీటిని పారనివ్వాలి.
- శుభ్రపరిచే సమయాల్లో రైతులు ముఖానికి, చేతులకు తొడుగులు విధిగా ధరించాలి. వీలైతే చలువే కంటి అద్దాలు వేసుకోవడం మంచింది.
- రసాయనిక ప్రక్రియ కాకుండా అయితే లేటరల్ పైపుల చివరన ఉన్న ఎండ్‌క్యాప్‌లను వారానికి ఒక సారి తీసి వేసి 10నిమిషాల పాటు నీటిని వదలాలి. తద్వార లేటరల్ పైపులు శుభ్రపడతాయి. మెయిన్‌లైన్ చివరన గల ఎండ్ క్యాప్‌లను సైతం తీసి ఉంచడం వలన నీటిలో మలినాలు శుభ్రపడతాయి.



టెస్టుల్లో శ్రీలంక 'సెంచరీ' విజయం

బౌలర్లు రమేశ్ మెండిస్ (5/64), ప్రభాత్ జయసూర్య (2/88), అసిథా ఫెర్నాండో (3/30) రాణించడంతో... ఐర్లాండ్‌తో గాలెలో జరిగిన రెండో టెస్టులో శ్రీలంక ఇన్నింగ్స్ 10 పరుగుల తేడాతో గెలిచింది. దాంతో కరుణరత్నే కెప్టెన్సీలోని శ్రీలంక రెండు టెస్టుల సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 1982లో టెస్ట్ హోదా పొందిన శ్రీలంక జట్టుకిది 100వ టెస్టు విజయం కావడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 54/2తో ఆట చివరిరోజు శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 77.3 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది.



సెమీఫైనల్లో సుమిత్ నగాల్

రోమా గార్డెన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ సుమిత్ నగాల్ వరుసగా మూడో విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. రోమ్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సుమిత్ 7–5, 6–0తో మాక్స్ హూక్స్ (నెదర్లాండ్స్)పై గెలుపొందాడు. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

సాత్విక్-చిరాగ్ జోడీకి పతకం ఖాయం

సింధు, ప్రణయ్‌లకు నిరాశ



దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక పతకం ఖాయమైంది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21–11, 21–12తో అహసాన్-హెంద్రా సెతియవాన్ (ఇండోనేసియా) జోడీని ఓడించింది. ఈ గెలుపుతో సాత్విక్-చిరాగ్ 1978 తర్వాత ఆసియా చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో ఫైనల్ చేరిన, పతకాన్ని ఖరారు చేసుకున్న భారతీయ జోడీగా గుర్తింపు పొందింది. 1978లో ప్రకాశ్ పదుకొనే-సయ్యద్ మోడీ జోడీ భారత్‌కు రజత పతకం అందించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ పీవీ సింధు 21–18, 5–21, 9–21తో ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. కాంటా సునెయామా (జపాన్)తో జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో హెచ్ఎస్ ప్రణయ్ తొలి గేమ్‌ను 11–21తో కోల్పోయి, రెండో గేమ్‌లో 9–13తో వెనుకబడిన దశలో గాయంతో వైదొలిగాడు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 18–21, 21–19, 15–21తో దెజాన్-గ్లోరియా విద్‌జాజా (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది.

రన్నరప్ కార్తీక్ వెంకటరామన్



చెన్నై: సన్‌వే ఫార్మెన్‌టెరా అంతర్జాతీయ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ రన్నరప్‌గా నిలిచాడు. స్పెయిన్‌లో ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 10 రౌండ్ల తర్వాత ఫెదోసీవ్ వ్లాదిమిర్ (రష్యా), కార్తీక్ వెంకటరామన్ (భారత్), ప్రణవ్ (భారత్), లియోన్ ల్యూక్ మెండోకా (భారత్) ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. విజేతను నిర్ణయించేందుకు ఈ నలుగురి మధ్య ప్లే ఆఫ్ గేమ్‌లను నిర్వహించారు. వ్లాదిమిర్, కార్తీక్ ఫైనల్ చేరగా.. ఫైనల్లో కార్తీక్‌పై నెగ్గి వ్లాదిమిర్ విజేతగా నిలిచాడు.

లక్నో పరుగుల సునామీ

- మేయర్స్, స్టొయినిస్, బదోని, పూరన్ మెరుపులు
- 56 పరుగులతో పంజాబ్‌పై జయభేరి



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్

మొహాలీ: వారంకిందట గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో చేతిలో బోలెడు వికెట్లున్నా తక్కువ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది లక్నో సూపర్ జెయింట్స్. ఇప్పుడదే జట్టు పంజాబ్ కింగ్స్‌పై పరుగుల పంజా వేసింది. ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు చేసి మరీ 56 పరుగులతో ఘనవిజయం సాధించింది. మొదట లక్నో 20 ఓవర్లలో 5 వికెట్లకు 257 పరుగుల భారీస్కోరు చేసింది. స్టొయినిస్ (40 బంతుల్లో 72; 6 ఫోర్లు, 5 సిక్సర్లు), మేయర్స్ (24 బంతుల్లో 54; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), పూరన్ (19 బంతుల్లో 45; 7 ఫోర్లు, 1 సిక్స్), బదోని (24 బంతుల్లో 43; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. తర్వాత పంజాబ్ 19.5 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. అథర్వ (36 బంతుల్లో 66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.

దంచుడే... దంచుడే...

మేయర్స్ రెండో ఓవర్లో పెట్టిన ధనాధన్ ముహూర్తం తర్వాత వచ్చిన వారంతా దంచేసేలా చేసింది. రాహుల్ (12) నిరాశపరచగా... గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్, రజా, రబడలు వేసిన పవర్‌ప్లేలో మేయర్స్ 'నాటు నాటు' కొట్టుడుతో 20 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. ఇంకో ఫోర్ కొట్టి జోరుమీదున్న అతన్ని రబడ బోల్తా కొట్టించాడు. కానీ పవర్‌ప్లేలో లక్నో 74/2 స్కోరు చేసింది. ఓపెనర్ల ఆట ముగిసినా... దూకుడైతే ఎంతకీ ఆగలేదు. బదోని, స్టొయినిస్‌ల బ్యాట్లు కూడా భారీ షాట్లపైనే గురి పెట్టడంతో 7.4 ఓవర్లలోనే స్కోరు 100 దాటింది. గుర్నూర్ వేసిన ఆ ఎనిమిదో ఓవర్లో ఇద్దరు చెరో 6, 4లతో 24 పరుగులు పిండారు. ఆటలోనే హైలైట్స్ చూపెట్టడంతో 10 ఓవర్లలో లక్నో 128/2 స్కోరు చేసింది. కాసేపటికి 6 కొట్టిన బదోని మరుసటి బంతికి అవుటైతే... తర్వాత వచ్చిన పూరన్ హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. ఇలా ఆకాశమే హద్దుగా సాగిన లక్నో స్కోరు 15.5 ఓవర్లోనే 200 పరుగులు దాటింది. స్టొయినిస్ 31 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. డెత్ ఓవర్లలో స్టొయినిస్, పూరన్ అవుట్ కావడంతో ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు నమోదైంది. లేదంటే స్కోరు చరిత్ర మారేది! 2013లో పుణే జట్టుపై బెంగళూరు 263 పరుగులు చేసింది.

200 పైచిలుకు తీసుకొచ్చినా...

ధావన్ (1), ప్రభ్‌సిమ్రన్ (9) నిరాశపరిచినప్పటికీ అథర్వ, రజా (22 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) జట్టు స్కోరును 100 దాటించారు. ఆ తర్వాత లివింగ్‌స్టోన్ (23; 2 ఫోర్లు, 1 సిక్స్), జితేశ్ (24; 3 సిక్స్‌లు), స్యామ్ కరన్ (11 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) షారుఖ్ (బి) రబడ 12; మేయర్స్ (సి) ధావన్ (బి) రబడ 54; బదోని (సి) చహర్ (బి) లివింగ్‌స్టోన్ 43; స్టొయినిస్ (సి) జితేశ్ (బి) కరన్ 72; పూరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 45; హుడా (నాటౌట్) 11; కృనాల్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 257.** **వికెట్ల పతనం:** 1–41, 2–74, 3–163, 4–239, 5–251. **బౌలింగ్:** గుర్నూర్ 3–0–42–0, అర్ష్‌దీప్ 4–0–54–1, రబడ 4–0–52–2, రజా 1–0–17–0, చహర్ 4–0–29–0, స్యామ్ కరన్ 3–0–38–1, లివింగ్‌స్టోన్ 1–0–19–1.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) సబ్-సామ్స్ (బి) నవీనుల్ 9; ధావన్ (సి) కృనాల్ (బి) స్టొయినిస్ 1; అథర్వ (సి అండ్ బి) బిష్ణోయ్ 66; రజా (సి) కృనాల్ (బి) యశ్ 36; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 23; స్యామ్ కరన్ (సి) బదోని (బి) నవీనుల్ 21; జితేశ్ (సి) రాహుల్ (బి) యశ్ 24; షారుఖ్ (సి) బిష్ణోయ్ (బి) యశ్ 6, చహర్ (సి) హుడా (బి) యశ్ 0; రబడ (బి) నవీనుల్ 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 201.** **వికెట్ల పతనం:** 1–3, 2–31, 3–109, 4–127, 5–152, 6–178, 7–192, 8–193, 9–197, 10–201. **బౌలింగ్:** స్టొయినిస్ 1.5–0–21–1, మేయర్స్ 1–0–4–0, బదోని 0.1–0–0–0, నవీనుల్ 4–0–30–3, అవేశ్ 2–0–28–0, మిశ్రా 2–0–23–0, బిష్ణోయ్ 4–0–41–2, యశ్ 3.5–0–37–4, కృనాల్ 1–0–13–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	8	5	3	10	0.939
లక్నో	8	5	3	10	0.841
గుజరాత్	7	5	2	10	0.580
చెన్నై	8	5	3	10	0.376
బెంగళూరు	8	4	4	8	-0.139
పంజాబ్	8	4	4	8	-0.510
కోల్‌కతా	8	3	5	6	-0.027
ముంబై	7	3	4	6	-0.620
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా × గుజరాత్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
ఢిల్లీ × హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్ఐఆర్' నమోదు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఢిల్లీ పోలీసుల చర్య
- కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన



"సుప్రీం కోర్టు ఆదేశాలను నేను స్వాగతిస్తున్నా. ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నాకూ మంచిదే. విచారణలో వారికి అన్ని విధాలా సహకరిస్తా. విచారణ కమిటీలు ఏర్పాటు చేసినప్పుడు కూడా నేను ప్రశ్నించలేదు. రెజ్లర్లు మరికొంత సమయం ఆగాల్సింది. కానీ వారు కోర్టుకు వెళ్లారు. ఎవరి పట్లా తప్పుగా వ్యవహరించలేదు. నాకు నాపై నమ్మకముంది.

–బ్రిజ్‌భూషణ్ సింగ్

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు స్పందించారు. శుక్రవారం సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్ఐఆర్' నమోదు చేస్తామని ఇచ్చిన హామీని పూర్తి చేశారు. బ్రిజ్‌భూషణ్‌పై కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మైనర్ రెజ్లర్ చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుంటూ 'పోక్సో యాక్ట్' ప్రకారం ఒక ఎఫ్ఐఆర్... ఇతర రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ప్రకారం మరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. రెండింటిపై సత్వర విచారణ చేపడతామని పోలీసులు చెప్పారు. ఈ అంశంపై మే 5న మరోసారి విచారిస్తామని, ఆలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిరసన చేస్తున్న రెజ్లర్లు, ఫిర్యాదు చేసిన వారి జాబితాలో ఉన్న ఒక మైనర్ రెజ్లర్ భద్రతకు సంబంధించి కూడా ఢిల్లీ పోలీసులు బాధ్యత తీసుకోవాలని కూడా సుప్రీం సూచించింది. 'మైనర్ రెజ్లర్‌కు ఉన్న ముప్పును దృష్టిలో పెట్టుకుంటూ తగినంత భద్రత కల్పించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆదేశిస్తున్నాం. ఇతర రెజ్లర భద్రతను కూడా ఆయన సమీక్షించాలి. దర్యాప్తునకు సంబంధించిన డాక్యుమెంట్ల విషయంపై గోప్యత కూడా పాటించాలి' అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడా బెంచీ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు బజరంగ్, వినేశ్, సాక్షి తదితర రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద తమ నిరసన కొనసాగిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించడం పట్ల రెజ్లర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఎఫ్ఐఆర్ మాత్రమే కాదు, బ్రిజ్‌భూషణ్ అరెస్ట్ అయ్యే వరకు ఇది కొనసాగుతుందని బజరంగ్ స్పష్టం చేశాడు. 'విజయం దిశగా ఇది మొదటి అడుగు మాత్రమే. అయితే మా నిరసన ఇకపైనా కొనసాగుతుంది. ఆయనను అన్ని పదవుల నుంచి తప్పించడంతో పాటు జైలుకు పంపాల్సిందే. లేదంటే విచారణను ప్రభావితం చేస్తాడు' అని రెజ్లర్ సాక్షి మలిక్ పేర్కొంది.



వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్, సాక్షి

'కరెంట్ కట్'



'ఢిల్లీ పోలీసులు మా పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. ఎఫ్ఐఆర్ నమోదైంది కాబట్టి నిరసన ముగించమని ఒత్తిడి తెస్తున్నారు. కరెంట్ కట్ చేసి గేట్లు మూసేశారు. భోజనం, నీళ్లు కూడా లోపలికి రానివ్వడం లేదు. నేను ఏసీపీతో మాట్లాడాను. ఏం చేస్తారో చేసుకోండి అని ఆయన జవాబిచ్చాడు. వారు ఏం చేసినా మా ఆందోళన కొనసాగిస్తాం. మీ ఇంటి ఆడపిల్లలైతే ఇలాగే చేస్తారా. బ్రిజ్‌భూషణ్ చట్టంకంటే పెద్దవాడిగా మారిపోయాడు' (అర్ధ రాత్రి 12 గంటలకు పరిస్థితి).

సిసింద్రీలకు సమ్మర్ కేర్!





ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే వేసవి సెలవులు మొదలయ్యాయి. ఇక పిల్లల ఆటలు, పాటలు అంటూ ఎక్కువ సేపు బయటే తిరుగుతూ ఉంటారు. తిండీ, నిద్రనూ కూడా నిర్లక్ష్యం చేసి మరీ ఆటల్లో మునిగిపోతారు. సమ్మర్‌లో చిన్నపిల్లలను నిర్లక్ష్యం చేస్తే త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే వడదెబ్బ, చర్మ సమస్యలతో సహా మరెన్నో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే వాళ్లను ఈ కాలంలో మరింత జాగ్రత్తగా చూసుకోవాలి.

మధ్యాన్నం పూట బయటకు పంప వద్దు

వేసవిలో పిల్లలు ఎక్కువగా ఆటలు ఆడుకోవడానికి.. బయటకు వెళ్లిపోతారు. అయితే మధ్యాహ్న సమయం లో మాత్రం పిల్లలను బయటకు అనుమతించవద్దు. ఆ సమయంలో ఎండ ఎక్కువగా ఉంటుంది, రేడియేషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. బయట వాతావరణం చాలా వేడిగా ఉండడం వల్ల పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరిగి.. చెమట ఎక్కువగా పడుతుంది. ఒంట్లో నీరు వేగంగా ఆవిరై... డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఇవి వడదెబ్బకు దారితీస్తాయి. ఉదయం, సాయంత్రం ఎండలేని సమయాల్లోనే పిల్లలను బయటకు అనుమతించాలి.

ఏం చేయాలి మరి?

మధ్యాహ్న సమయంలో పిల్లలకి కథలు చెప్తూ, పుస్తకాలు చదివిస్తూ, బొమ్మలు వేయిస్తూ, ఇంట్లో ఆడుకునే ఆటలు ఆడుకునేలా చూడాలి. పజిల్స్ ఇవ్వడం, అంత్యాక్షరి, వర్డ్ బిల్డింగ్ వంటివి ఆడించాలి. వారికి ఆసక్తి ఉన్న అంశంపై మరింత ఎక్కువ ఏకాగ్రత చూపేలా లేదా రాని సబ్జెక్టును నేర్చుకునేలా చేయాలి.

మసాలాలు, జంక్ ఫుడ్ జోలికి వెళ్లవద్దు..

వేసవిలో కారం, మసాలా, వేపుళ్లు, స్వీట్లు వంటి వాటికి దూరంగా ఉంచాలి. కారం, మసాలాలు తింటే మరింత వేడి చేసే ప్రమాదం ఉంది. పిజ్జా, బర్గర్, అలాగే నిల్వ ఆహారాన్ని ఇవ్వకూడదు. ఇవన్నీ దాహాన్ని మరింత పెంచుతాయి. ఎక్కువగా ఇంట్లో తాజాగా వండిన ఆహారాన్నే తీసుకునేలా చూడాలి. అలాగే లేస్, కుర్కురేలు వంటివి అసలు మంచిది కాదు. వీలయినంత వరకు ఇంట్లో వండిన చిరుతిళ్లే అలవాటు చేయాలి.

సౌకర్యంగా ఉండే దుస్తులు

బయటి వాతావరణం వేడిగా ఉన్నప్పుడు చిన్నారులకు తేలికైన, కాటన్ వస్త్రాలను వేయాలి. ఇవి సింథటిక్, ఇతర ఫ్యాబ్రిక్స్ కంటే చెమటను ఎక్కువగా పీల్చేసుకుంటాయి కాబట్టి బేపజాలకు పోకుండా పిల్లలకు లేత రంగులలో ఉండే కాటన్ దుస్తులను వేయడం ఉత్తమం. అలాగే రెండుపూటలా స్నానం చేయించడం మంచిది. బయట ఆటలాడి వచ్చినా, ఇంట్లోనే ఉన్నా కూడా పిల్లలకు చెమట పడుతుంది. అలాగే వదిలేస్తే అలర్జీలు వస్తాయి. అందువల్ల గోరువెచ్చటి నీటితో రెండుపూటలా స్నానం చేయించాలి.

పండంటి ఆరోగ్యం కోసం..

సాధారణంగా వేసవిలో పిల్లల చర్మం పొడిబారి, దురద, మంట వంటి పలురకాల ఎలర్జీలు మొదలవుతుంటాయి. అటువంటి లక్షణాలు కనిపించినప్పుడు వారు డీహైడ్రేషన్‌కు గురైనట్లు గుర్తించాలి. యూరిన్‌కు అతి తక్కువగా వెళ్లడం, కడుపునొప్పి, తలనొప్పి, వికారంగా ఉన్నా.. జాగ్రత్తగా గమనించాలి. మామిడి, ద్రాక్ష, పైనాపిల్, పుచ్చ, కమలాజ్యూస్‌లు పట్టించాలి. రోజూ ఉదయం గ్లాసు కొబ్బరినీళ్లు ఇవ్వాలి. ఇందులోని పొటాషియం వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. పిల్లలతో రోజుకి కనీసం రెండు లీటర్ల నీటిని తాగించడం అన్నింటికన్నా ముఖ్యం. సబ్జానీళ్లు ఇస్తే మరీ మంచిది.

వేసవి ఫ్లూ

5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఏడాది పొడవునా ఈ సమస్యలు తరచుగా వస్తాయి. కాబట్టి వారిని ఎండలో తిరగనీయకుండా ఉంచాలి. సాయంత్రం వేళ లేదా ఉదయం పూట వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఆడుకోవడానికి అనుమతివ్వండి. వారికి సరైన పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచవచ్చు.

కీటకాల బెడద

ఎండాకాలంలో దోమలు చిరాకు పుట్టిస్తాయి. దోమలే కాకుండా ఇతర కీటకాల కాటుకు పిల్లలు గురయ్యే అవకాశం ఉంది. ప్రభావిత ప్రాంతంలో దురద, వాపు వస్తాయి కాబట్టి వైద్యుల సూచన మేరకు పిల్లల కోసం ప్రత్యేకమైన దోమల నివారణ మందులను వాడేందుకు ప్రయత్నించండి.

చల్లటి పదార్థాలు ఇవ్వద్దు

వేసవిలో తాపం ఎక్కువగా ఉండటం సహజం. చల్లటివి ఏమైనా తినాలని, తాగాలనీ అనిపిస్తుంది. అలాగని ఫ్రిజ్‌లో పెట్టి.. తీసిన వెంటనే తిన్నా అవి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. పిల్లలు ఫ్రిజ్ నీళ్లు తాగితే.. జలుబు చేసే అవకాశం ఉంది. దానికన్నా కుండ నీళ్లు తాగించడం చాలా మంచిది.

మజ్జిగ ఇవ్వండి

మధ్యాహ్నం భోజనం తర్వాత పలుచటి మజ్జిగలో చిటికెడు జీలకర్ర పొడి, ఉప్పు, పావుచెక్క నిమ్మరసం కలిపి తాగిస్తే జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. మజ్జిగలో కాల్షియం, విటమిన్ బి 12, పొటాషియం అందుతాయి. ఇవి తలనొప్పి, వికారం వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని స్తాయి. క్యారెట్, కీర దోస ముక్కలపై కాస్త నిమ్మ రసం, చిటికెడు ఉప్పు చల్లి తినిపించడం మంచిది. ముఖ్యంగా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి.

సన్‌స్క్రీన్

మీ పిల్లలు బయటకు వెళ్లేప్పుడు.. అతిగా ఎక్స్‌పోజ్ అయ్యే భాగాలకు సన్‌స్క్రీన్ లోషన్ రాయడం మంచిది. సన్‌స్క్రీన్ పిల్లలను వడదెబ్బ, రాషెస్ నుంచి రక్షిస్తుంది. మీ పిల్లలు బయట ఉండే సమయం బట్టి.. సన్‌స్క్రీన్ రెండు సార్లు రాసినా పర్వాలేదు.

కూలింగ్ గ్లాసెస్

మీ పిల్లలు ఎండల్లో బయటకు వచ్చినప్పుడల్లా.. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకునేలా చూడండి. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే.. సూర్యుని కిరణాలు డైరెక్ట్‌గా కళ్లల్లో పడవు, కళ్లు సేఫ్‌గా ఉంటాయి. కుదిరితే.. క్యాప్ పెట్టుకుంటే ఇంకా మంచిది.. ఎండ డైరెక్ట్‌గా వారి తల మీద పడదు. ఎండ తలమీద పడితే.. తలనొప్పి, వినుగు, కళ్లు తిరిగే అవకాశం ఉంటుంది. బయట నుంచి ఇంటింది వచ్చిన తర్వాత చల్లటి నీళ్లతో కళ్లు శుభ్రంగా కుడిగితే.. వారికి ప్రశాంతంగా ఉంటుంది.

ఈతకు వెళుతుంటే...

చెరువులు.. బావులకు సరదాగా ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. కొంత మంది పాత బావుల్లో కూడ ఈతకు వెళతారు. ఇలాంటి సమయంలో కొన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలు ఈత కొట్టే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు రోజంతా బయట ఆడుకుంటారు, ఈ సమయంలో వారు తినడం, తాగడం మర్చిపోతారు. అటువంటి పరిస్థితిలో, వారి ఆహారంపై మరింత శ్రద్ధ వహించడం మంచిది.

మామిడిపళ్లు తినేముందు...



మామిడి పండ్లను తినేముందు వాటిని కనీసం ఒక గంట పాటు నీటిలో నానబెట్టాలని అమ్మమ్మలు, నానమ్మలు సలహా ఇస్తూ ఉంటారు. కారణం ఏమిటంటే, మామిడిపండ్లలో ఫైటిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంటుంది. ఇలా అధికంగా ఉత్పత్తి అయ్యే ఈ యాసిడ్‌ను తొలగించడానికి నీళ్లలో నానబెట్టాలి. వివిధ కూరగాయలు, ధాన్యాలు, పప్పులు వంటి వాటిలో ఈ ఫైటిక్ యాసిడ్ ఉంటుంది. ఇలా నానబెట్టడం వల్ల అది విచ్ఛిన్నమైపోతుంది. ఈ ఫైటిక్ యాసిడ్ అదనపు వేడిని కూడా ఉత్పత్తి చేస్తుంది. నీటిలో నానడం వల్ల ఈ అదనపు వేడి తగ్గిపోతుంది.

టాక్సిన్లను తొలగిస్తుంది

మామిడి పండ్లను తినడానికి ముందు గంటపాటు నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి తొక్కపై ఉండే కనిపించని నూనె తొలగిపోతుంది. అది కొందరిలో ఎలర్జీలు కలిగించే అవకాశం ఉంది. అలాగే పాలీఫెనాల్స్, టానిన్లు వంటి సూక్ష్మ పదార్థాల మిశ్రమం తొక్క పైన ఉండే అవకాశం ఉంది. అవి శరీరంలో చేరితే దురద, బొబ్బలు రావడానికి కారణం అవుతుంది. మామిడిపండ్లు నానబెట్టడం వల్ల అవన్నీ తొలగి పండు తినడానికి అనువుగా సురక్షితం గా మారుతుంది.

మామిడి పండ్లను ఇలా నీటిలో నానబెట్టడం వల్ల వాటి రుచి కూడా బాగుంటుంది. ప్రత్యేకించి ఆ పండ్లను ఫ్రిడ్జ్‌లో ఉంచినట్లయితే వాటిని కచ్చితంగా నీళ్లల్లో నానబెట్టాలి. ఎందుకంటే ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఆ పండులో ఉండే కొన్ని సమ్మేళనాలు పండు వాసనను, రుచిని మార్చేస్తాయి. నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి సహజమైన తీపి, సువాసనను తిరిగి పొందవచ్చు.

నులి పురుగుల నివారణకు...



పిల్లలు కొన్నిసార్లు ఎంత రుచిగా చేసి పెట్టినా సరే, ఆకలి కావడం లేదంటారు. తరచూ విరేచనాలు చేసుకుంటారు. బరువు తగ్గిపోయి బలహీనంగా కనిపిస్తుంటారు. ఎందుకు ఇలా అవుతోందో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. నిజానికి ఇవి ప్రమాదకరమైన వ్యాధి లక్షణాలేమీ కాదు. కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయి. వాటిని ఎలా నివారించాలో తెలుసుకుందాం...

తినే ఆహారం పేగుల్లోకి చేరినప్పుడు రక్తంలోకి చేరాల్సిన పోషకాలను నులిపురుగులే పీల్చుకోవడంతో చిన్నారుల్లో ఎదుగుదల నిలిచిపోయి రోగాల బారిన పడుతారు. ఆకలి మందగించి ఒక్కోసారి ప్రాణాల మీదికి కూడా వస్తుంది.

కడుపులో నులి పురుగులు పోవడానికి...

- వేప నూనె పది చుక్కలు చక్కెరలోవేసి లోపలకు తీసుకుంటే క్రిములు నశిస్తాయి
- గుప్పెడు లేత వేప చిగురు, అర చెంచా ఉప్పు, అర చెంచా పసుపు కలిపి మాత్రల్లా చేసుకొని రాత్రి నిద్రించే ముందు ఒక మాత్ర వేసుకుంటే నులిపురుగులు నశిస్తాయి.
- పచ్చి బొప్పాయి కాయకు గాట్లు పెట్టగా వచ్చిన పాలు చెంచా, ఆముదం చెంచా కలిపి తాగితే. పురుగులు పడిపోతాయి.
- ఎండించిన వేప పువ్వు 50 గ్రాములు. మిరియాల పొడి చెంచా, ఉప్పు చెంచా కలిపి ప్రతిరోజు భోజనంలో మొదటి ముద్దగా కలుపుకుని తినాలి, లేదా గ్లాసు నీటిలో ఒక చెంచా వేసి సగం అయ్యే వరకు మరిగించి కషాయం లాగా తాగినా కూడా నులిపురుగులు నశిస్తాయి.
- వీటన్నింటినీ చేయడం కష్టం అనుకుంటే ఆల్బెండిజాల్ ట్యాబ్లెట్‌ను పదిహేను రోజులకొకసారి చొప్పున నెలరోజులు వాడాలి. ఒక నెల గ్యాప్ ఇచ్చి అదే రిపీట్ చేయాలి.